# ముళ్ళకిరీటం

'హవీస్'

మాధవరావు ఫైళ్ళు మూసి, లేచి నిలబడ్డాడు.

ఉదయం తొమ్మిదిన్నర ఐంది. మరో అరగంటలో ఆఫీసుకి పోవాలి. క్రితంరోజు సాయంత్రం ఐదింటివరకూ ఇంటర్వ్యూ పని సరిపోయింది. ఆ పూట సంతకాలు చెయ్యవలసిన కాయితాలూ, ఇంటర్వ్యూ చేసినవారి తాలూకు రిపోర్ట్సూ—అది ఈరోజు పూర్తిచేయాలి. మాధవరావుకు ఆ ఇంటర్వ్యూ తల్చుకుంటే చిన్నగా నవ్వు వచ్చింది.

కొద్దిగా విచారం కలిగింది కూడా.

చదువుకుంటున్నన్నాళ్ళూ ప్రతివాడికీ భువి బంగారు మలామా వేసిన పూలబాటలాగా కనిపిస్తుంది—డిగ్రీ చేతికి రావటం తరువాయి ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయనే భ్రమతో. ఆ తరువాత కథ ప్రారంభమైనాక, నిరాశ నిస్పృహ కలగటం ప్రారంభిస్తాయి. సాధారణంగా అవి ఉండవలసిన (లేక ఉండదగిన) దానికంటె ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఖాయంగా జరుగుతుందన్న పని కాకపోవటంవల్ల కలిగే నిరాశ, ఆ నమ్మకం లేకుండా చేసిందానివల్ల కలిగే దానికన్నా, ఎక్కువకదా!

మాధవరావుకి పదేళ్ళక్రితం తన జీవితం గుర్తుకొచ్చింది. అప్పుడు తాను పట్టి బి. కాం. అదైనా డింకీలు పల్లకీలతో ఐందనిపించాడు. అంటే దండయాత్రలవల్లకాదు. ముందు చూపుకన్నా, వర్తమాన సుఖాలమీదే ధ్యాస ఎక్కువ ఉండే తండ్రికిపుట్టే తనయుడి బాధ అది. యాచనచేతకాక, అది లేక గడవక, ఆత్మ విశ్వాసం చావక, అది అహంకారంగా ఇతరులచేత అనిపించుకో బడటంలో ఉన్న తమాషా అది. తమాషాయే మరి. తన చదువు అలాగే సాగింది. ఐతే అందులో—తన విషయంలో ఒక్క సుగుణం ఏమిటీ అంటే తన తల్లి భీరువు కాదు. తనను అలా కానివ్వలేదు.

ఆ తరువాత ఉద్యోగాన్వేషణా ప్రకరణం ప్రారంభమైంది. తనకు ఎలాంటి సిఫార్సులూలేవు. ఉద్యోగార్హతలలో అతి ముఖ్యమైన ఆ క్వాలిఫికేషన్ తనకు లేకపోవడం సమస్యను మరింత భయంకరం చేసింది. చివరికి కేవలం అదృష్టవశాత్తూ ఒక బ్రిటిష్ కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది.

ఆ తర్వాత పెళ్ళైంది. జీవితం కొంత సాఫీగానే నడుస్తున్నా, ఆఫీసులో గొడవలు మనసును కల్లోలం చేసేవి. అంతా కట్‌థ్రోట్ కాంపిటీషన్. ఎవరికివారు పై అధికారి ప్రాపకం సంపాదించి, పెద్దపీటకోసం ఆరాటపడడం. ఆ ప్రయత్నంలో ఇతరులమీద లేనిపోని చాడీలు. నిజానికి అవన్నీ పట్టించుకోవలసిన అవసరం తనకేమీలేదు. తను పట్టించుకునేవాడుకాదు కూడా. ఐతేనేం? అందరిచేతా వంగి వంగి సలాములు చేయించుకుంటున్న ఆఫీసరుకి తాను ముభావంగా ఉండటం నచ్చిందికాదు. ఏదో రకంగా 'పగ తీర్చుకునే ప్రయత్నం చేసేవాడు. అప్పుడూ అదృష్టమే తనను కాపాడింది. హెడ్ ఆఫీసు మరీ అంత తెలివి తక్కువదికాదు. రాబర్ట్సన్ దొర మానేజింగ్ డైరెక్టర్—తనంటే ఎందుకో అభిమానం చూపించేవాడు. ఆయన చలవ వల్లనే తన శ్రమ ఫలించి ఈనాడు బ్రాంచి మానేజరైనాడు. అందుకు ఎన్ని విమర్శలు? ఎదురుగా అనకపోయినా చాటున 'మూల విరాట్టునే పట్టాడు గురూ' లాంటి మాటలు అనుకునేవారు తమ ప్రయత్నం ఫలించకపోయిన వారందరూ. తనకు వారందరిమీదా జాలివేసేది. తాను జీవితంలో నేర్చుకున్నది, అమ్మ నేర్పింది ఒక్కటే పాఠం. ఆనందానికి, విజయానికి 'షార్ట్‌కట్'లు లేవు.

అందుకే తనకు ఈ హోదా రాగానే ఒక్కటే నిశ్చయం చేసుకున్నాడు. నిజంగా అర్హతఉన్నవారికి తనతోచిన సహాయం చేయాలి. ఆ సంగతి విన్న అమ్మా, కమలా చాలా ఆనందించారు. కమల అన్నది కూడా 'అందరూ మీలాంటివారే ఐతే దేశం ఎంత బాగుపడిపోను?' అని. తాను గర్వించాడు. తనకు లోటే లేదని ఆనందించాడు.

"ఏమిటి ఆలోచిస్తూ నుంచున్నారు? భోజనానికి రారా?" అన్న భార్య మాట విని వెనక్కి తిరిగాడు మాధవరావు. కమల మాధవరావు నిలుచున్నచోటికి వెనగ్గా ఉన్న గోడమీది ఫోటోను చూసి, "ఏమిటో పెళ్ళి ఫోటో పరిశీలిస్తున్నారు?" అన్నది సగం సిగ్గుతో, సగం కొంటెగా.

మాధవరావు నవ్వి, "మధుర స్మృతులు" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

"ఇవాళ ఆఫీసు లేదేమిటి?" అన్నది కమల.

మాధవరావు ఉలిక్కిపడ్డట్టు, "ఔనౌను. తొందరగా వడ్డించమను అమ్మని" అన్నాడు స్టాండుమీద తువాల అందుకుంటూ.

"అంతా సిద్ధంగానేఉంది. మీరు రావటమే తరువాయి."

భోజనం చేస్తుండగా పార్వతమ్మ అన్నది: "మీ మామయ్య, అబ్బాయీ సాయంకాలమే వెళ్ళిపోతారుట నాయనా! అబ్బాయి ఉద్యోగం సంగతి ఏం చేశావు?" అని. మాధవరావు నోటి దగ్గర చెయ్యి ఒక్కక్షణం ఆగింది. ఆ తర్వాత అతను ముద్ద మింగి "ఇవాళ ఉత్తరం రాస్తున్నాను" అన్నాడు క్రీగంట కమలవంక చూస్తూ.

"ఏదో వాళ్ళు నీమీద ఆశ పెట్టుకు వచ్చారా? అతనూ పరాయివాడుకాదు. స్వయానా కమల పినతండ్రి. ఐనవాళ్ళం ఒకళ్ళ కొకళ్ళం చేసుకోకపోతే ఎవరు చేస్తారు?"

మాధవరావు తటపటాయింపులో పడ్డాడు. అతనికి చెప్పాలని ఉన్న నిజం ఆడవాళ్లిద్దరికీ నచ్చకపోవచ్చు.

కొడుకు సందేహం గమనించలేదు పార్వతమ్మగారు. "అబ్బాయి బుద్ధిమంతుళ్లాగే ఉన్నాడు. ఆ ఉద్యోగం కాస్తా దొరికితే వో ఇంటివాడౌతాడు" అన్నది.

'దొరక్కపోతే కాడా?' అనుకున్నాడు మాధవరావు. ఆమాటే పైకి అందామనుకుని 'ఎందుకొచ్చిన రభస?' అని మానేశాడు. తన పినమామగారు పేదరికంతో అల్లాడిపోవటం లేదు. లక్షలకి లక్షలు లేకపోవచ్చునుగాని, జాగ్రత్తగా చూసుకుంటే రెండు తరాలకి సరిపోయే ఆస్తి ఉన్నది. ఒక్కడే కొడుకు. అతనూ అంత వయసుమీరిపోయినవాడేమీకాదు. ఈ ఉద్యోగం రాకపోయినా అతనికి పెద్ద ఇబ్బంది కలుగదు.

"ఆ అబ్బాయికి ఇమ్మని రాస్తున్నావుగా?" అన్నది పార్వతమ్మగారు తిరిగి.

"అలా రాయటానికి వీల్లేదమ్మా. వచ్చిన వాళ్లందర్నీ ప్రశ్నలు అడిగాంకదా? వాటినిబట్టి మార్కులు వేశాం. ఆపైన వాళ్ల క్వాలిఫికేషన్లూ, నడవడి సర్టిఫికెట్లూ ఉంటాయికదా? అవన్నీ హెడ్ ఆఫీసుకి పంపిస్తున్నానివాళ. వాళ్లు ఎవర్ని తీసుకోమంటే వాళ్లని తీసుకుంటాను' అన్నాడు.

"నీ చేతిలో ఏమీ లేదన్నమాట?" అన్నది పార్వతమ్మగారు కించిత్ నిరాశగా.

"అదేగా చెప్పేది!" అన్నాడు మాధవరావు చేతులు కడుక్కుంటూ.

గదిలో కోటు తొడుక్కుండుండగా లోపలకు వచ్చింది కమల వక్కపొడి డబ్బా తీసుకుని. మాధవరావుకి ఆమెవంక చూసే ధైర్యం లేకపోయింది. వక్కపొడి ఎటోచూస్తూ అందుకుని, బల్లమీది ఫైళ్లు తీసుకున్నాడు. గబగబా బైటికి రాబోయి, "చూడండి" అన్న కమల పిలుపుతో గుమ్మం దగ్గర ఆగిపోయాడు.

"ఐతే సుందరానికిఆ ఉద్యోగం రాదన్నమాటేగా?" అన్నదామె. ఆమె గొంతులో మార్దవమూ, లాలనా లేవు. చాలా పొడిగా ఉన్నది.

"ఆ మాట నేననలేదు" అన్నాడు మాధవరావు పిరికిగా.

"ఈ మాత్రందానికి ఎవరు అబద్ధా లాడమన్నారు? మీ రాబర్ట్‌సన్........"

మాధవరావు కీ సారి మాట ధాటీగానే వచ్చింది. "రాబర్ట్‌సన్‌గారు కాదిప్పుడు జనరల్ మానేజరు. ఆయన ఆర్నెల్ల కిందటే రిటైరైనాడు" అన్నాడు.

కమల ఒక్కక్షణం ఏమీ అనలేదు. ఆ తర్వాత, "సరే! మీరు అధికారులు. బాబాయితోటి ఈ సంగతి చెప్పమన్నారా?" అన్నది.

మాధవరావు గడియారంవంక చూసి, "నాకు టైమౌతోంది" అని జవాబివ్వకుండా వీధిలోకి వచ్చేశాడు.

రిక్షాఎక్కి కూచున్న తర్వాత మాధవరావుకి కించిత్ పశ్చాత్తాపం లాంటిది కలిగింది. కమలతో తాను మొరటుగా ప్రవర్తించాడు. తన వాళ్లకి సాయం చెయ్యలేదన్న బాధతో ఆమె కొంత కటువుగా మాట్లాడితే మాట్లాడి ఉండవచ్చుగాక. అందుకు తా నలా ప్రవర్తించటం ఏమంత మంచిది? మాధవరావు మరో ఆలోచనరాగా తనను తాను వోదార్చుకున్నాడు. సాయంత్రం ఇంటికివెళ్ళి క్షమాపణ కోరుకుంటే సరిపోతుంది. కమల చాలా మంచిది!

రిక్షా ఆఫీసు దగ్గర ఆగింది. మాధవరావును చూసి బైట నిలబడి కబుర్లాడుకుంటూన్న గుమాస్తాలంతా నిశ్శబ్దంగా లోపలకు వెళ్ళిపోయారు. మాధవరావు, మౌనంగా లోపలికి పోయాడు. తన సీటులో కూచున్నాక ప్యూన్‌ని పిలిచి "రామారావుగార్నిలా రమ్మను" అన్నాడు. రెండు నిమిషాల తర్వాత రామారావు లోపలకు వచ్చాడు.

"రెండు ఉత్తరాలు చెబుతాను. వ్రాసుకోండి" అన్నాడు.

రామారావు తలవూపి కలమూ, కాయితం అందుకున్నాడు.

ఉత్తరాలు చెప్పటం అయింతర్వాత "రంగారావుగారు పూర్నించి వచ్చినట్టున్నాడే?" అన్నాడు మాధవరావు.

రామారావు చిన్నగా నవ్వి, "నిన్న సాయంత్రం వచ్చాడు" అన్నాడు.

"ఏమిటి విశేషాలు?"

రామారావు మాధవరావు భావం అర్థం చేసుకుని "హెడ్ ఆఫీసులో మీ గురించి ఏవో గుస గుసలు ప్రారంభమైనాయట. ట్రాన్స్‌ఫర్ అలాంటి దేదో జరుగుతుం దనుకుంటున్నారుట" అన్నాడు.

"ఎవరు చెప్పార్ట?"

"అతనో ఎవరు చెబుతారండి?" అన్నాడు రామారావు నవ్వి.

మాధవరావు నవ్వి వూరు కున్నాడు.

ఉత్తరాలు టైప్ చెయ్యటం ఐపోయాక రామారావు వెళ్ళిపోయాడు. వారం రోజుల్నుంచీ టైపిస్టు సెలవులో ఉన్నది. ఆఫీసులో రహస్యాలు కాపాడగలవాడు రామారావు ఒక్కడే నని నమ్మకం ఉండటంచేత, అతనిచేత ఉత్తరాలు టైప్ చేయిస్తున్నాడు మాధవరావు. 'ఈ కాస్త దానికి ఎంత రభస?' అనుకున్నాడు మాధవరావు. ఆ రంగారావుకి తన సొమ్మేదో పోయినట్లు బెంగ. అందుకే సెలవు పెడతానంటే వెంటనే శాంక్షన్ చేశాడు తను. అతను హెడ్ ఆఫీస్‌కి పోయివచ్చాడు!

ఉత్తరాలు సరిచూసి, సంతకాలు పెడుతూండగా బంట్రోతు లోపలకువచ్చి, "సుదర్శనంగారట మీ కోసం వచ్చారయ్యా" అన్నాడు. మాధవరావు తలెత్తి "రమ్మను" అన్నాడు.

నిముషం తర్వాత సుదర్శనంగారు లోపలకు వచ్చారు. కూచుంటూనే, "ఔనుగానీ, ఇంత పెద్ద ఆఫీసు, కనీసం నీ రూమైనా ఏర్ కండిషన్ చేయించలేదేమోయ్?" అన్నాడు.

"నా ఒంటికి పడదండి. అందుకని నేనే వద్దన్నాను" అని ఆయన అవస్థచూసి తానే ఫాను వేశాడు మాధవరావు.

కాస్త ప్రాణం తెప్పరిల్లాక, "అన్నట్టు బైట కారు లేదు. ఇంటికి పంపించారా?" అన్నాడు సుదర్శనంగారు తిరిగి.

"గారేజ్ కి పంపించాను. చిన్న రిపేరొచ్చింది"

సుదర్శనంగారు ఒక్క క్షణం వూరుకుని, "నిన్ను చూస్తూ ఉంటే చాలా సంతోషంగా ఉంటుందోయ్ మాధవరావూ! కష్టపడ్డావు. పైకొచ్చావు. ఐతే ఒకటి. కష్టపడ్డవారంతా పైకొస్తున్నారా? నీ మంచితనం, పరోపకారబుద్ధీ నిన్ను పైకి తెచ్చాయి. ఏమంటావు?" అన్నాడు.

"అంతా మీ చలవ"

"అదేమన్నమాట? ఆ మాటకొస్తే నేను చేసిన సాయం ఏవుంది? వేలిచ్చానా? లక్షలిచ్చానా?" మాధవరావు చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"నీ సంగతి అప్పు డప్పుడు మా ఇంటిది కూడా అంటూ ఉంటుంది. పొద్దున్నే నీ సంగతి వచ్చింది. నిన్న ఇంటర్వ్యూకి నా మేనల్లుడు కూడా వచ్చాడుగా? వాడికి నువ్వు ఉద్యోగం ఇస్తావో లేదోనని తాపత్రయం. అతనంత కృతఘ్నుడు కాడులే అని వూరుకోబెట్టాను. పోనీ వాడైనా వాజ అయితే నువ్వు అనుమానిస్తావు, నిక్షేపంగా బి. యే. పాసయ్యాడు. తెలివి గలవాడు. ఏమంటావ్?"

మాధవరావు ఏమీ అనలేదు.

సుదర్శనంగారు బల్లమీదఉన్న ఉత్తరాలవంక క్రీగంట చూస్తూ, "హెడ్ ఆఫీస్ కన్ఫర్మేషను ఎప్పుడొస్తుందో?" అన్నాడు.

"వారం రోజులైనా పడుతుంది" అన్నాడు మాధవరావు.

"అబ్బా? ఐతే వారంవరకూ మావాడు గోళ్లు గిళ్లుకుంటూ కూచోవలసిందేనంటావు? అన్నట్టు అడగటం మరచాను. జీతం ఎంతుంటుంది?"

"అర్హతానర్హతల్ని బట్టి ఉంటుంది"

సుదర్శనంగారి కనుబొమలు ముడిపడ్డాయి. "అంటే?" అన్నాడు.

"క్వాలిఫికేషన్లూ అదీ చూస్తారుగదా? నిన్నటి ఇంటర్వ్యూ మార్కులు చూస్తారు. దాన్నిబట్టి జీతం నిర్ణయిస్తారు"

"అలాగా?" అన్నా డాయన గంభీరంగా.

మాధవరావు ఆయనలో కలిగిన మార్పు నర్థం చేసుకున్నాడు. నిజానికి తను ఎవర్ని సెలెక్ట్ చేశాడో, చెప్పవలసిన అగత్యంలేదు. చెప్పకూడదు కూడా. ఆమాట మొహాన కొట్టినట్టు చెప్పటం తన చాత కావటంలేదు. సుదర్శనంగారు తన చదువుకి కొంత సాయం చేశాడు. ఆ సాయం ఏ పరిస్థితుల్లో చేశాడో అని తర్కించటం అనవసరం. వ్యాపారం చేసుకునే వాడికి లక్ష వ్యావర్తులుంటాయి. అందువల్ల విసుగుదల కలగటం కూడా సహజమే. పైగా బిచ్చగాడికి ఎంచే హక్కులేదు.

సుదర్శనంగారు లేచి నిలబడి, "వస్తాను మాధవరావు. పాపం నీకు లక్ష పనులుంటాయి. ఇదివరకిటివాడివికాదుగా? ఆఫీసరువాయె. ఎంతమందితోనో మొహమాటాలు, పనులు ఉంటాయి. వస్తాను" అన్నాడు.

మాధవరావు లేని నవ్వు తెచ్చుకుని, లేచి నిలబడి "మంచిది ఉంటాను" అన్నాడు చేతులు జోడిస్తూ.

తుమ్మల్లో పొద్దూకినట్లుగా ఐన మొహంతో సుదర్శనంగారు వెళ్ళిపోయాడు. మాధవరావు కుర్చీలో కూలబడ్డాడు. ప్యూన్ టపా తీసుకొచ్చి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు. ఒక్కొక్కటి తీసి చదువుతూ మనఃక్లేశాన్ని దూరం చేసుకో యత్నించసాగాడు మాధవరావు. అన్నీ ఎక్కడెక్కటినుంచో వచ్చిన ఆర్డర్లు. అన్నింటినీ పరిశీలించిన తరువాత చివరి కవరు చింపాడు మాధవరావు. అది తనకు వ్యక్తిగతంగా వ్రాసింది. రాజమండ్రినుంచి వచ్చింది. మాధవరావుకు ఆ ఉత్తరంలోని దస్తూరి పరిచితమే. అందులో ఏమంటుందో అతనికి తెలుసు. ఐనా చదివాడు.

ప్రియమైన మాధవరావుకు,

ఇక్కడ మేమంతా క్షేమం. నువ్వూ, కమలా, వదినా కులాసా అనుకుంటాను. వారం రోజులక్రితం నీ కొక ఉత్తరం వ్రాశాను. దానికి జవాబు రాలేదు. బహుశా పని ఒత్తిడి మూలాన రాసిఉండవనుకుంటున్నాను.

మావాడు అక్కడికి ఇంటర్వ్యూకి వచ్చిన సంగతి నీకు తెలుసుగదా? వాడు స్వతహాగా భిడియస్తుడు. నలుగురితో కలిసి మెలిసి తిరగలేనివాడు. అందుచేత మీ ఇంటో ఒక్క పూటైనా భోంచేయకుండా తిరిగి వచ్చేశాడు. నువ్వు దానికి బాధపడకు. కమలనీ, వదిన్నీ బాధ పడవద్దని చెప్పు. ఏడాది పాటు మా ఇంటో మీ రిద్దరూ ఉన్నారు. అలాంటిది ఒక్క పూట మా వాడికి నువ్వు భోజనం పెట్టనంటావా?

మావాడు ఇంటర్వ్యూ సంగతేమీ (ఎలా జరిగిందో ఏమిటో) నాతో చెప్పలేదు. ఎలా సమాధానాలు చెప్పాడో ఏమో? చెపితినికదా భిడియస్తుడని? నాకైతే బెంగలేదు. ఎలాగూ అపాయింటింగ్ అథారిటీ నువ్వేకదా?

పిన్ని నిన్ను అడిగానని చెప్పమన్నది. పిల్లలంతా కులాసా. నీ క్షేమం తెలియపరుస్తూ ఉత్తరం వ్రాయి.

ఆశీస్సులతో

నీ బాబాయి రమణమూర్తి

మాధవరావు 'బావుంది' అనుకున్నాడు.

అంతా ఆలోచిస్తుంటే నవ్వాలో ఏడవాలో తోచకుండా ఉన్నది తనకి. అందరికీ ఆ ఉద్యోగం కావాలి. అందరూ కాస్తో కూస్తో వెనకాలవున్న వాళ్లు. తల్చుకుంటే మరో ఉద్యోగం సంపాయించుకోగలరు. ఆ తల్చుకోవటమే ఎందుకు శరీరాయాసం హాయిగా మన వాడుండగా? అని కాబోలు ఉద్దేశ్యం!

బాబాయి వ్రాసిన ఉత్తరంలో 'భిడియస్తు' డన్నమాట నవ్వు తెప్పించింది మాధవరావుకి. ఎవరి పిల్లలు వారికి ముద్దు. అడిగిన ప్రశ్నల్లో నూటికి పదింటికి జవాబుచెప్పి ఆ పదింటిలో ఎనిమిదింటిని బొంగతోనే కైలాసం పంపించిన 'భిడియస్తుణ్ణి'

ఎలాగ ఉద్యోగంలో తీసుకోవటం? మాట్లాడిన ప్రతి ఇంగ్లీషు వాక్యంలోనూ ఆ భాషమీద గౌరవం ఉన్నవార్ని నూతిలో దూకి చావాలనిపించే వైదుష్యమే. డిగ్రీ అంటూ ఉంటుంది. అత్తెసరు మార్కులుకన్నా ఎక్కువే వస్తాయి కూడా. నిజ స్వరూపంమాత్రం అలా ఉంటుంది.

ఇంటర్వ్యూలో వేసే ప్రశ్నలూ అంతంత మాత్రంగానే ఉంటాయి. ఐతే వాటి వెనకాతలిది అభివృద్ధి ప్రెజెన్స్ ఆవ్ మైండ్‌నీ, చురుకుదనాన్ని పరీక్షించాలన్న ఆశయమే. ఒకా నొక కంపెనీలో గుమాస్తా పని చెయ్య దల్చుకున్నవాడికి 'సహారా అనేది టిబెట్టులోని యాత్రా స్థలం' అని తెలిస్తే ప్రమాదం ఏమీ లేదేమోకానీ, అంతచక్కగా పాఠాలు వంటబట్టించుకున్నవాడు ఈనాడు చేయవలసినపనిమీద ధ్యాస ఉంచుతాడని నమ్మటం ఎలాగ? డిగ్రీలు, మార్కులుకన్నా చురుకుదనం ముఖ్యమనుకునే కంపెనీ తమది. అలాంటి పుంభావ సరస్వతులకి జాగా ఇవ్వ లేకపోవటం తన తప్పా?

మాధవరావుకి ఆ కుర్రవాడు గుర్తు కొచ్చాడు. అతని పేరు సుందర శివరావుట. వయసులో చాలా పిన్నవాడులా కనిపించాడు. స్కూలు ఫైనల్ పాసయి టైప్‌రైటింగ్, షార్ట్‌హేండూ పాసైనాడు. చాలా చురుగ్గా చూడంగానే ఆకర్షించే వాడిలాగా కనిపించాడు. బి. యే. లూ, బి. కాం. లూ చెప్పలేకపోయిన ప్రశ్నల్లో చాలావాటికి సమాధానాలు చెప్పాడు. అతను పేదవాడన్నది స్పష్టం. అంత చిన్న వయస్సులోనే పొట్ట పోషించుకునే ప్రయత్నం చేయవలసి వచ్చినందుకు అతనేమీ బాధపడినట్టు కనిపించలేదు. జీవితంలోని ఒడుదుడుకులను ఒడ్డునుంచి చూడగల ఆత్మ విశ్వాసం గోచరించింది అతనిలో. అన్నింటికిమించి అతను ఎవరి సిఫార్సులూ తీసుకురాలేదు.

అతని హావ భావాలూ, ఆకర్షణా తనని మోసగించకుండా చాలా జాగ్రత్త పడ్డాడు మాధవరావు. మొహం రాయిలా చేసేసి ప్రశ్న లడిగాడు. అతనూ రిజర్వుడుగానే సమాధానాలు చెప్పాడు. మరీ లేత కుర్రాడని తప్ప, అతన్ని ఉద్యోగంలోకి తీసుకోకపోవటానికి కారణం ఏమీ కన్పించలేదు మాధవరావుకి.

టెలిఫోన్ మోత మాధవరావు ఆలోచనలకి అంతరాయం కలిగించింది. రిసీవర్ అందుకుని, "హలో" అన్నాడు మాధవరావు.

అవతలి గొంతు ఎవరిదో గుర్తించడం అసాధ్యమేమీ కాలేదు మాధవరావుకి. చైర్మన్ మల్లపరాజుగారు. ఈయన కాండిడేటు కూడా ఉన్నాడా? అనుకున్నాడు మాధవరావు. ఆ అనుమానంతో మరో శంక కూడా కలిగింది. మల్లపరాజుగారు తనను ఎన్నో విధాల ఆదుకున్నాడు. తను ఈ కంపెనీలో చేరటానికి సాయం చేసింది కూడా ఆయనే. ఆయనమాట కాదనవలసి వస్తుందా? తన నిర్ణయం రైటు చేయబడి మరో క్షణంలో టపాకి పోనున్నది. ఐనా గొంతు తడి చేసుకుని, "నమస్కారమండీ" అన్నాడు.

"ఆ! ఏమీలేదోయ్! మొన్న నువ్వు పంపించిన వాటికి బిల్లు రాలేదు. డబ్బు పంపిద్దామని ఫోన్ చేశాను" అన్నాడాయన.

బతుకుజీవుడా అనుకున్నాడు మాధవరావు. "దాని దేముందిలెండి? సాయంత్రం అటు వచ్చినప్పుడు తెస్తాను" అన్నాడు.

"సరేలే!........ఏమిటి విశేషాలు? నిన్న నేవో ఇంటర్వ్యూలు జరిగాయటగా?"

"ఔనండీ"

"మా వాళ్లకుర్రా డొకడున్నాళ్లే. మంచివాడు. నిన్న ఇంటర్వ్యూ కొచ్చాడు. వాడు చెబితే తెలిసింది......... ఉంటాను" అని ఫోన్ పెట్టేశా డాయన.

ఈ వార్త మరింత బాధాకరంగాఉంది అనుకున్నాడు మాధవరావు. అయితే ఆయన తాలూకు వాడెవడో ఉన్నాడన్న మాట. ఎవరో తెలిస్తే బాగుండును. తెలిస్తేమాత్రం తా నిప్పు డేం చేస్తాడు? చేసిన నిర్ణయం మార్చటం సాధ్యమా? మరి తన అభివృద్ధికి కారకుడైన వ్యక్తి మాట నిలబెట్టొద్దా? తన అధికారంలో వేలు పెట్టడం ఇష్టం లేకనే మల్లపరాజుగారు అలా నిర్లిప్తంగా ఉన్నా డన్నది స్పష్టం. అందుకు తాను బదులేం చేశాడు?

మాధవరావుకి తాను ఉద్యోగంలో చేరనున్న రోజు గుర్తు కొచ్చింది. తాను ఇంటర్వ్యూలో నెగ్గుతాననే ధైర్యంగా ఉన్నాడు. మల్లపరాజుగార్ని తాను ఏ సహాయమూ అర్థించ లేదు. అమ్మమాత్రం ఏదో మాటల సందర్భంలో ఆయనతో అన్నదిట. బంధువైనందుకు ఆయన సాయంచేయతలపెట్టాడు. కాని, ఆయనకూ ఒకరిదగ్గర చేయి చాచే అలవాటు లేదు. అందుకోసం ఏం చేశాడు? ఆరోజు తనను ఇంటికి పిలిపించి తన సత్తా ఏదో మాటల సందర్భం అన్నట్లుగా పరీక్ష చేశాడు. ఆ తర్వాత ఆయనకు అంతకుముందే పరిచయమున్న కంపెనీ మానేజర్‌తో మాట్లాడాడు. ఏం మాట్లాడాడో ఐతే తనకు తెలీదు. ఉద్యోగం వచ్చింతరువాత 'ఇదంతా మీ చలవే' నని నమస్కరించబోతే 'అదేం లేదేయ్! ఆయనే నిన్ను సెలెక్టు చేశాడు' అన్నాడు.

అలాంటివాడు మల్లపరాజుగారు. మరి ఆయనకు కృతజ్ఞత తెల్పుకోవటం తన విధికదా? తన అభిప్రాయం మార్చుకుంటే...

మాధవరావు ఏ నిర్ణయానికి రాలేకపోయాడు. ఆలోచనలు మార్చుకునేందుకు కొంతసేపు ఫైళ్లు తిరగేశాడు. వచ్చిన ఆర్డర్లను డిస్పాచింగ్ క్లర్కుకు పంపించాడు. అదంతా అయేసరికి లంచ్ టైమైంది. మాధవరావు మామూలు ప్రకారం టీ తెప్పించుకు తాగి తన రూమ్‌లోనుంచి బైటికి వచ్చాడు. ఆఫీసరు అనే గౌరవంతో అంతా మాటలు ఆపేసి తమ పనులు తాము చూసుకోసాగారు. ఒక్కసారి ఆఫీసంతా కలయ దిరిగి, తిరిగి తనసీటుకొచ్చి కూచున్నాడు మాధవరావు. మనసు కాస్తంత తేలిక పడినట్లైంది.

మరో గంట గడిచింది.

పని చూసుకుంటున్నాడన్న మాటేగాని మాధవరావు మనసంతా మల్లపరాజుగారి తరపు కుర్రవాడిమీదికే లాగసాగింది. అత నెవరై ఉంటాడో అతని వూహ కందటంలేదు. ఉన్న ఒక్క ఉద్యోగానికే డజనుమంది వచ్చారు. ఆ డజనుమందీ తాను ఏరినవాళ్లు. అందులో ఆ సుందర శివరావు ఒక్కడుతప్ప మిగతా వారందరూ అనర్హులుగానే కనిపించారు తనకి. ఒక వేళ అతనే మల్లపరాజుగారి తాలూకేమో? అలాఐతే ఇహ తనకు ఏ బెంగాలేదు. కాని, అతనని ఎలా? మిగతా వాళ్లల్లో ఎవరై ఉంటారు అని కొంతసేపు ఆలోచించాడు. వాళ్లల్లో ఇద్దరు ముగ్గురు తప్ప అందరికీ ఏవో సిఫార్సు లున్నాయి. లేని ముగ్గుర్లో ఆ కుర్రవాడుపోతే మిగిలిన ఇద్దరూ ఈ వూరివారుకాదు. వాళ్లలోనే ఒకడై ఉంటాడా?

మాధవరావు నుదుట పట్టిన చెమట తుడుచుకుంటుండగా బంట్రోతు లోపలకొచ్చి, "మీ మామయ్యగారట వచ్చారుసార్" అన్నాడు మాధవరావుకి మొదట ఆ మాట అర్థం కాలేదు. "ఎవరూ?" అన్నాడు.

"మీ మామయ్యగారట"

మాధవరావు 'చిత్రంగానే ఉందే! ఈయనింకా వూరు పోలేదా?' అనుకుని, "రమ్మను" అన్నాడు ఫైలు మూస్తూ.

రాజారావుగారు లోపలకువచ్చి "పాపం నిన్ను డిస్టర్బ్ చేసినట్టున్నానే?" అన్నాడు నవ్వుతూ.

మాధవరావు పినమామగారి మొహం ఉషారుగానే ఉండటం గమనించి, "అదేంలేదు. ఏమిటిలా వచ్చారు?" అన్నాడు.

రాజారావుగారు కూచుని, "ఏంలేదు. సాయంత్రం అయిదింటి బండికి వెళ్ళిపోతున్నాను. చెప్పిపోదామని వచ్చాను" అన్నాడు.

మాధవరావు తలవంచుకుని, "క్షమించండి మావయ్యా! మీకు సాయం చెయ్యలేకపోయాను" అన్నాడు.

రాజారావుగారు నవ్వి, "అలాగంటా వేమిటోయ్! నే నందుకేమీ బాధపడటంలేదు. కాని, నీ మనసులోని మాట నా దగ్గర కూడా దాచుకున్నావే అని బాధపడుతున్నాను. మనలో మనకి రహస్యాలైతే ఎలాగ?" అన్నాడు.

మాధవరావుకి పినమామగారి మాటలు అబ్బురంగా తోచినై. తనింతవరకూ ఆయన్ని అపార్థం చేసుకున్నాడా? ఈమాత్రం విశాల హృదయం లేకపోయిందా కమలకి?

"ఇందాక ఆ రంగారావుగారు కనిపించాడు. అతని మామగారు ద్వారా అతను నాకు కాస్త పరిచయం. అతనే చెప్పాడు అసలు సంగతి." అని జేబులోంచి అయిదు వందనోట్లు తీశాడు రాజారావుగారు. "ఓ స్నేహితుడుంటే అడిగి పట్టుకొచ్చాను. ఇంద. ఇది తీసుకుని ఆ ట్రాన్సిస్టర్ రేడియో కొనుక్కో. ఛైర్మన్ గారికేం? పదవిలో ఉన్నవాడు. ఎవడి కాళ్లో పట్టుకుని ఉద్యోగం వేయించుకోగలడు" అన్నాడు. మాధవరావుకి ఆయన చెబుతున్నదంతా అయోమయంగానే ఉన్నది. కొద్ది క్షణాలదాకా అతనినోట మాట రాలేదు. ఆ తర్వాత "ఎందుకీ డబ్బు?" అన్నాడు.

"ట్రాన్సిస్టరు కావాలనుకుంటున్నావుటగా?"

"ఎవరు చెప్పారు?"

"అతనేనోయ్! రంగారావని ఇక్కడ పని చేయటంలా? అతను?"

గుమాస్తా రంగారావు. తాను ట్రాన్సిస్టరు కొనుకుందామనుకుంటున్నట్లు, ఆయనతో చెప్పటం ఏమిటో అర్థం కాలేదు మొదట మాధవరావుకి. అర్థం ఐనాక శరీరమంతా కోపంతో అసహ్యంతో దహించుకుపోయింది. "గుడ్ గాడ్!" అన్నాడు కోపావేశంవల్ల కలిగిన దిగ్భ్రమతో.

రాజారావుగారు నోట్లు బల్లమీద పెట్టబోయాడు.

మాధవరావు వాటివంకా, ఆయనవంకా నిరసనగా చూసి, "దయచేసి మీరు వెళ్లండి" అన్నాడు.

రాజారావుగారులేచి, "అలాగే. పాపం నువ్వు ఎంత పని చూసుకోవాలో........వస్తాను" అన్నాడు కదలబోతూ.

"ఆ డబ్బు కూడా తీసుకువెళ్లండి" అన్నాడు మాధవరావు కర్కశంగానే.

"అదేం?"

"ప్రశ్న లడక్క ముందు తీసుకు వెళ్లండి" అన్నాడు మాధవరావు మరింత కఠినంగా.

రాజారావు తెల్లబోయాడు. ముఖం పాలిపోయింది. విధిలేక డబ్బు తీసుకు వెళ్ళిపోయాడు.

మాధవరావు నిస్సత్తువగా కుర్చీలో చేరగిలబడిపోయాడు. అతనికి రంగారావుమీదా, పినమామమీదా పట్టరాని క్రోధం కలుగుతున్నది. ఎంత రాస్కెల్సు వీళ్లు! ఏం చెయ్యాలి వీళ్లని? మామగారి అభిప్రాయంలోని నైచ్యం ఎంత జుగుప్సాకరం? ఛీ! ఛీ!

ఆ షాక్‌నించి స్థిమితపడటానికి చాలాసేపు పట్టింది మాధవరావుకి. అతని జీవితంలో అతను ఘోరావమానం పొందినట్లుగా బాధపడటం అదే మొదటిసారి. నాగరిక జీవితంలో కరడు కట్టుకుపోయిన మోసం, కుళ్ళితం అతని స్వప్న జగత్తు

పునాదులనే కదిలించి వేసింది. అన్నింటిమీదా, అందరిమీదా పట్టరాని కసి పెల్లుబక సాగింది.

బంట్రోతు లోపలకొచ్చి డిస్పాచింగ్ క్లర్కు పంపిన ఇన్‌వాయిస్‌లు బదల్లమీదపెట్టి "అన్నీ టైపు చేసేశారుసార్!" అన్నప్పుడు ఇహలోకంలోకి వచ్చాడు మాధవరావు.

ఒకటి, రెండు చూసి మూడోది తీసుకున్న మాధవరావు కళ్లకి అందులోని తప్పులు భూతాల్లాగా కనిపించాయి. "ఆయన్ని రమ్మను" అన్నాడు.

బంట్రోతువెళ్ళి ఆ గుమాస్తాను పిల్చుకొచ్చాడు.

"ఏమిటండీ ఈ యిన్‌వాయిస్‌లు! ఒళ్లు దగ్గర పెట్టుకునే కొడుతున్నారా?"

ఆ గుమాస్తా మాధవరావు మాటల్లో క్రొత్తదనానికి చకితుడై, "తప్పులున్నాయాసార్?" అన్నాడు.

"లేకపోతే సరసాలాడుతున్నానా? మందమతిగా పన్లు చేసే బదులు మానుకుంటే మంచిది"

"మళ్లీ కొడతానులెండి"

"మళ్లీ కొట్టట మేమిటండీ మళ్లీ? ఇదేం ఆఫీసా? మార్కెట్టా?"

గుమాస్తా కిపారి కష్టం వేసింది.

"ఎందుకుసార్ అలా మాట్లాడుతారు?"

మాధవరావు ఇన్‌వాయిస్‌లు అతని ముఖాన విసిరికొట్టి, "యూ మీన్ టు ఆర్గ్యు విత్‌మి? గెటౌట్!" అన్నాడు తారస్థాయిలో.

గుమాస్తా తను చేసిన కాస్తంత తప్పుకి, ఏనాడూ మాట్లాడని మనేజర్‌గారు ఎందుకింత రెచ్చిపోయాడో అర్థంగాక, నేలమీద చిందర వందరగా పడిఉన్న ఇన్‌వాయిస్‌లను ఏరుకుని వెర్రి మొహంతో స్వింగ్‌డోర్ తలుపు తెరిచి, అక్కడ నిలబడిఉన్న వ్యక్తినిచూసి మరింత కంగారు పడిపోయి "గుడ్ మార్నింగ్‌సార్" అన్నాడు ఆయనవంకా, మానేజర్‌గారివంకా చూస్తూ.

ఆయన లోపలకొచ్చి "మీ రిక వెళ్లండి" అన్నాడు ఇంగ్లీషులో.

గుమాస్తా వెళ్ళిపోయాడు.

మాధవరావు ఆయన్ను చూడగానే నిర్ఘాంతపోయి లేచి నిలుచున్నాడు. వందల మైళ్ల దూరంలోఉన్న జనరల్ మానేజరు ముందుగా తెలియబరచకుండా హఠాత్తుగా రావటం అతనికి అగమ్యగోచరం అనిపించింది.

జనరల్ మానేజర్‌గారుమాత్రం "గుడ్‌మార్నింగ్ మిష్టర్ మాధవరావ్" అన్నాడు చిరునవ్వు ముఖంతో. అప్పటికి తేరుకున్న మాధవరావు "రండి రండి" అన్నాడు సగౌరవంగా.

ఆయనవచ్చి కుర్చీలో కూచున్నాడు. కొద్ది క్షణాల దాకా ఇద్దర్లో ఎవరూ ఏమీ మాట్లాడలేదు. మాధవరావుకి ఆయనెందుకు ఉన్నట్టుండి వూడిపడ్డాడో ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు.

"ఏమిటి హటాత్తుగా వచ్చారు?" అన్నాడు చివరికి.

నవ్వి, " అలా వద్దామనే" అని, "ఎలా ఉంది ఆఫీసు వర్కు? ఈనెల సేల్సు ఫిగర్ ఎంత?" అన్నా డాయన.

మాధవరావు ఫైలు తీసి ఆయనముందు పడేసి లెడ్జర్ తెప్పించి చూపించాడు. ఆయన మౌనంగా పరిశీలించటం ముగించి, "వెరీగుడ్ ప్రోగ్రెస్" అన్నాడు.

ప్యూను లెడ్జర్‌లు తీసుకు వెళ్ళిపోయారు.

నిన్నటి ఇంటర్వ్యూ రిపోర్టు తయారు చేశారా?" అన్నా డాయన తిరిగి.

"చేశాను" అని రిపోర్టు ఆయనముందు పెట్టాడు మాధవరావు.

ఆయనవి తీసుకుని ఒక్కక్షణం మౌనంగా కూచుండిపోయాడు. ఆ తర్వాత "మీ కొక విషయం చెప్పవలసి వచ్చినందుకు చాలా విచారిస్తున్నాను మాధవరావు! మీమీద ఈమధ్య హెడ్ ఆఫీస్‌కి చాలా రిపోర్టు లొచ్చాయి. సబార్డినేట్స్‌ని చాలా అవమానకరంగా చూస్తున్నారుట. మీరు రాబర్ట్‌సన్‌గారి అభిమానం సంపాదించుకున్నవారు. వారి కీ విషయం తెలిస్తే ఎంత బాధ పడతారు. ఆయన మీమీద ఉంచిన నమ్మకాన్ని మీరు వమ్ము చెయ్యకూడదు. పైగా అది మన కంపెనీ గౌరవ ప్రతిష్ఠలకు భంగకరం" అన్నాడు గంభీరంగా.

మాధవరావు ముఖం పాలిపోయింది.

జనరల్ మానేజర్‌గారు రిపోర్టు ఆమూలాగ్రం చదివి, "ఐతే మీరు ఎస్.,సుందర శివరావు అనే అతన్ని సెలెక్టు చేశారన్నమాట?" అన్నాడు.

"ఔనండి."

"మిగతా వారిలో కామర్సు గ్రాడ్యుయేట్లు కూడా ఉన్నట్టున్నారు?

"ఇంటర్వ్యూలో వారెవరూ నెగ్గలేదు"

"అంతేనా? ఈ కుర్ర వాడికి ఎవరిదైనా ఘాటైన రికమెండేషన్ ఉన్నదా?"

మాధవరావు నీరుకారిపోయాడు. ప్రొద్దుటినుంచీ జరుగుతున్న సంఘర్షణకి పరాకాష్ఠ యిది. జనరల్ మానేజర్‌గారు యూరోపియన్. కటువుగా, మూర్ఖంగా మాట్లాడే రకంకాదు. అలాంటివాడు అంతటిమాట అనటం అతనికి తల కొట్టేసినట్టుగా ఉన్నది. మనసు విరిగిపోయింది. అతనికి ఈ ఉత్తరాల వెనకనున్న ఆసామీ తెలియకపోలేదు. అతన్ని ఏమీ అనుకోలేకపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నా డాయన తిరిగి.

"ఏమీలేదు........అత నొక్కడేనండి రికమెండేషన్‌లేని వాడు" అన్నాడు మాధవరావు.

ఆయన మాధవరావువంక సూటిగాచూసి, "నిజంగా లేదా?" అన్నాడు.

"లేదు" అన్నాడు మాధవరావు దృఢంగా.

ఆయన ఒక్కక్షణం వూరుకుని, "చూడండి మిస్టర్ మాధవరావు! సిఫార్సులతో ఉద్యోగా లివ్వటం మన ఆచారం కాదు. అతని కెవరి సిఫార్సూ లేదంటున్నారు. నా కది రుజావు కావాలి" అన్నాడు.

"ఏం చెయ్యమంటారు?" అన్నాడు మాధవరావు.

ఆయన ఒక్క నిముషం ఆలోచించి, "అతని కీ వూళ్లో తెలిసిన గొప్ప వాళ్ళెవరైనా ఉన్నారా?" అన్నాడు.

"నాకు తెలియదు"

జనరల్ మానేజర్‌గారు ఆలోచనలో పడ్డాడు. ఆయనకి పైవారి తాఖీదు కనక ఈ ప్రశ్నలన్నీ అడగక తప్పటంలేదు. కాని ఇంతవరకూ వచ్చాక వెనక్కి తిరిగిపోవటం ఎలాగ?

రెండు నిమిషాలు గడిచాయి.

ఫోను గణగణ మోగింది. మాధవరావు అందుకోబోతుండగా జనరల్ మానేజరే అందుకుని, "హలో" అన్నాడు.

అవతలినించి మల్లపరాజుగారి గొంతు వినిపించింది. "నేనోయ్ మల్లపరాజును. సాయంత్రం ఒకసారి మా ఇంటికి రాగలవా?" అన్నాడు.

జనరల్ మానేజర్‌గారు మౌత్ పీస్ మూసి, "మల్లపరాజు గారంటే ఎవరు?" అన్నాడు.

"ఈ వూరి చైర్మన్‌గారు" అన్నాడు.

"అలాగా?" అని రిసీవర్ అందించా డాయన మాధవ రావుకి.

మాధవరావు, "హలో! ఏమిటండీ!" అన్నాడు.

మల్లపరాజుగారు ఇందాక అన్నదే తిరిగి చెప్పి, "మ రెవ రన్నా ఉన్నారా అక్కడ" అన్నాడు.

జనరల్ మానేజర్‌గారని చెప్పాడు మాధవరావు.

మల్లపరాజుగారు "అలాగా?" అన్నాడు.

మాధవరావు "ఉంటానండీ" అని ఫోన్ పెట్టెయ్యబోయి, జనరల్ మానేజర్‌గారి సైగ చూసి, "ఏమిటి?" అన్నాడు.

"ఆయన తరపున కుర్రవా డెవరైనా వచ్చారేమో అడుగు?"

"వచ్చాడు" అన్నాడు మాధవరావు.

"అతని పేరేమిటి?"

మాధవరావు ఫోనులో అదే ప్రశ్న అడిగాడు.

మల్లపరాజుగారు ఒక్కక్షణం తటపటాయించి చివరికి చెప్పాడు: "అతనిపేరు ఎస్. సుందర శివరావోయ్" అని.

---